# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 5, మే 2026


## ప్రజలు నిర్భయంగా పోలీస్ సేవలు వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్, మే 4, ప్రభాతవార్త :**




ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 14 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

# వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం ఎందుకు?

* ఎండా, వానలకు సెంటర్లల్లో అన్నదాతల పడిగాపులు
* కొనుగోళ్లు జరపాలని అధికారులకు రైతుల వేడుకోలు



**చెన్నూరు, మే 4, ప్రభాతవార్త**

*ఆరుగాలం శ్రమించి వరిపంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పోసి ఇరవై రోజులు గడుస్తున్నా పంట కొనుగోళ్లు జరపకపోవడంలో ఆంతర్యమేంటని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని చెన్నూరు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వడ్లు పోసి ఇరవై రోజులు గడుస్తున్నా సెంటర్ నిర్వాహకులు కొనుగోళ్లు జరపక పోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి చాలా రోజులు అవుతున్నా కొనుగోళ్లు ప్రారంభిస్తలేరని, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్లను తడవకుండా కాపాడుతున్నామని, ఎండ,వేడిమికి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇకనైనా మేము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే కొనుగోలు జరపాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నామని రైతులు తెలిపారు.*

**అనుమతులు రాకనే ఆలస్యం..**

*ఈ విషయంపై వార్త ప్రతినిధి సెంటర్ నిర్వాహకులను వివరణ కోరగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నుంచి వడ్ల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రానందునే వడ్లకొనుగొల్లు మొదలు పెట్టలేదని తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు.*

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యము కొనుగోలు చేయాలి



**ఆసిఫాబాద్, మే 4, ప్రభాతవార్త :**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యము కొనుగోలు చేయాలనీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివారయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రబాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిలా శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషన్ ఇలంబర్తి తో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి విడియో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్టంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.సరిపడా టార్పలిన్ కవర్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియ జేయలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా మిగతా 2లో..




## ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 04, ప్రభాతవార్త**



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం మిగతా 2లో..

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యము కొనుగోలు చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

చర్యలు తీసుకోవాలన్నారు. మైచర్ యంత్రాలు ఆటో మేటిక్ ప్యాడి క్లైనర్ లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు పంపించాలన్నారు. హమిలిలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించి మే చివరి కల్లా 80 ధాన్యము కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని విడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ యం.డెవిడ్ వివిధ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రంలో మైచర్ యంత్రం, ఆటో మేటిక్ ప్యాడి క్లైనర్స్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి 100 చొప్పున టార్పలిన్ కవరు అందిస్తున్నామని, ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. హమాలి, వాహనాల కొరత లేకుండా స్థానికంగా వున్నా హమాలిలను, వాహనాలను సర్దుబాటు చేసుకోవాలన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చర్యలు తిసుకుంటామన్నారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్తారావు, జిల్లా సహకార శాఖ అధికారి మోహన్, జిల్లా రవాణశాఖ అధికారి రాంచందర్, మార్కెటింగ్ శాఖ అధికారి అశ్ఫక్ అహ్మద్, పౌర సరఫరాల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నార్నూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**నార్నూర్, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు "పోలీసులు మీ కోసం" కార్యక్రమంలో భాగంగా నార్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సీఐ అంజమ్మ, ఎస్సై శ్రీసాయి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. నార్నూర్ సర్పంచ్ బానోత్ కావేరి, ఖైర్దత్వ సర్పంచ్ సత్యం, నాయకులు కొర్రాల మహేందర్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. మొదటి రోజే మండలం నలుమూలల నుండి 40 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా, వారికి యోగా, కరాటే, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలలో ప్రాథమిక మెళకువలను నేర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీసాయి మాట్లాడుతూ.. విద్యార్థులు సెలవుల్లో ఇంటికే పరిమితం కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు నేర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఈ శిబిరం ఉద్దేశమని, ఇది నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది స్వరాజ్, కృష్ణ, నాగోరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల విక్రేతలపై ఉక్కుపాదం

**- చెన్నూరు రూరల్ సీఐ ఆర్. కృష్ణ హెచ్చరిక**
**- కోటపల్లిలో నలుగురు పాత నేరస్తుల బైండ్ ఓవర్**

**కోటపల్లి, మే 04, ప్రభాతవార్త**

నకిలీ పత్తి విత్తనాల బెడదను అరికట్టేందుకు కోటపల్లి పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సోమవారం చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. కృష్ణ ఆధ్వర్యంలో కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురు పాత నేరస్తులను స్థానిక తహశీల్దార్ ముందు హాజరుపరిచి, మంచి ప్రవర్తన కోసం బైండ్ ఓవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. కృష్ణ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను విక్రయించడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా పొలాల్లో వాడటం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే వారిపై విత్తనాల చట్టం ప్రకారం కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు భారీగా పెట్టుబడి నష్టపోవడమే కాకుండా, భూసారం దెబ్బతిని పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన గ్రామాల్లోని రైతులకు విజ్ఞప్తి చేస్తూ.. ఎక్కడైనా నకిలీ విత్తనాల అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజశేఖర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగులు సవాళ్లతో కూడిన వృత్తుల్లో రాణించాలి

**- జీఎం మునిగంటి శ్రీనివాస్ - భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ముగ్గురు మహిళా ఉద్యోగులకు సర్టిఫికెట్ల అందజేత**

**నస్పూర్, మే 04, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ కల్పిస్తున్న వృత్తి శిక్షణ అవకాశాలను మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని గౌరవప్రదమైన హోదాతో పాటు ఉన్నత వేతనాలు పొందే దిశగా ఎదగాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా నుంచి విజయవంతంగా హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ముగ్గురు మహిళా ఉద్యోగులకు జీఎం కార్యాలయంలో ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. లా విభాగంలో పనిచేస్తున్న నవ్య, ఎస్ అండ్ పీసీ విభాగం నుంచి ప్రియాంక, సీహెచ్‌పీ నుంచి త్రివేణి ఈ ప్రత్యేక శిక్షణను పూర్తి చేసుకున్నారు. మహిళా ఉద్యోగుల సేవలను అన్ని విభాగాల్లో విస్తృతం చేసే ఉద్దేశంతో సంస్థ వీరికి భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ కల్పించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ట్రైడ్స్ సంస్థలో 30 రోజుల పాటు నిపుణుల సమక్షంలో భారీ వాహనాల డ్రైవింగ్, నిర్వహణ మెళుకువలపై వీరు శిక్షణ పొందారు. సింగరేణి వ్యాప్తంగా ఎంపిక చేసిన 13 మందిలో శ్రీరాంపూర్ నుంచి ముగ్గురు మహిళలు ఈ ఘనత సాధించడం అభినందనీయమని జీఎం కొనియాడారు. మిగిలిన ఉద్యోగులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారు త్వరలోనే హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది,




సింగరేణిలో డంపర్ ఆపరేటర్లు లేదా ఇతర భారీ వాహన చోదకులుగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగడం సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, డీజీఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.



## రైతులు పంటల సాగులో మట్టి పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఏఈఓ త్రిసంధ్య

**జన్నారం, మే 4 , ప్రభాతవార్త**

పంటల సాగులో మట్టి పరీక్షలకు ప్రతి రైతు ప్రాధాన్యత ఇవ్వాలని జన్నారం క్లస్టర్ ఏఈఓ మల్యాల త్రిసంధ్య సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పోనకల్ రైతు వేదికలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ, మట్టి పరీక్షల ద్వారా భూమిలోని పోషకాల లోపాలను గుర్తించి, అవసరమైన మేరకే ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, ఎరువుల సమతుల్య వినియోగం, కీటక నియంత్రణపై పలు సలహాలు, సూచనలు చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేసి, మట్టి పరీక్షకు మట్టి నమూనాను శాస్త్రీయ పద్ధతిలో ఎలా సేకరించాలో స్వయంగా తీసి చూపించారు. ముఖ్య అతిథిగా హాజరైన జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రతి రైతు వ్యవసాయ శాఖ సూచనలు తప్పకుండా పాటించాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి పంటకు ముందు మట్టి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ కౌన్సిలర్ రవీందర్ రావు, చింతలపల్లి వెటర్నరీ వైద్యాధికారి రాజకుమార్, నాయకులు అజ్మీరా నందు నాయక్, కృషి సఖీలు జక్కుల రజిత, గోగు అంజలి, సాయిల్ హెల్త్ వాలంటీర్లు, అధిక సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా సేవలు అందించాలి

**ఆసిఫాబాద్, మే 4, ప్రభాతవార్త :**



పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ డిఎస్పీ అశోక్‌కు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బి. అశోక్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపి విధుల నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా భారతీయ బౌద్ధ మహా సభ స్థాపన దినోత్సవం

**వాంకిడి, మే 4, ప్రభాత వార్త :**

భారతీయ బౌద్ధ మహా సభ 71వ స్థాపన దినోత్సవాన్ని సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 1955 మే 4న అంబెడ్కర్ భారతీయ బౌద్ధ మహా సభ అనే సామాజిక సేవ సంస్థను ప్రారంభించారని, తద్వారా భారత ద్నేశలో అంటరానితనాన్ని ఎదురు కొంటున్న పంచములకు గౌరవ ప్రదమైన జీవితాన్ని ఇవ్వడానికి అంబెడ్కర్ ఆ రోజే మొదటి అడిగు వేశారని అన్నారు. అంతకు ముందు బుద్ధుడు, అంబెడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, భారతీయ బౌద్ధ మహా సభ మండల అధ్యక్షులు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే , కార్యదర్శి ప్రతాప్, నాయకులు ఉప్రే, ప్రకాష్, నూతన్, ప్రసాద్ లు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, మే 4, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు, యువరాజ్ మార్మాట్, యం.డెవిడ్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావానిలో వచ్చిన ప్రతి ధరఖాస్తును క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అన్నారు. గత ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ ధరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఇళ్ళ గణనలో భాగంగా స్వీయ గణన మే 10 లోగా చేసుకోవాలన్నారు. కార్యాలయంలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, పొరుగు సేవల ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలన్నారు. అనంతరం ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో అధికంగా భూ సమస్యలు, పింఛన్, ఇందిరమ్మ ఇళ్లపై వచ్చాయి. ఈ ప్రజావాణిలో అధికారులు, అర్జిదారులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత

# ఘనంగా రైతు వారోత్సవాలు


రైతులకు మట్టి ఆరోగ్య కార్డుల పంపిణీ చేసిన ఏఓ కార్తీషా


రైతు వేదికలలో మట్టి ఆరోగ్య కార్డుల పంపిణీ చేస్తున్న ఏఈఓ లు

**చింతలమానేపల్లి, మే 4, ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా సోమవారం రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గూడెం రైతు వేదిలలో మండల వ్యవసాయ అధికారి కార్తీషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతాంగానికి సాగు మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ చేతుల మీదుగా రైతులకు మట్టి ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు.

## భూసార రక్షణే లక్ష్యం..

ఈ సందర్భంగా ఏఓ కార్తీషా మాట్లాడుతూ రైతులు విచక్షణారహితంగా ఎరువులు వాడి భూసారాన్ని దెబ్బతీసుకోవద్దని అన్నారు. మట్టి పరీక్షల నివేదికల ఆధారంగానే ఎరువులు వడలని రైతులకు సూచించారు. ముఖ్యంగా వేసవి కాలంలో లోతు దుక్కులు దున్నడం ద్వారా భూమిలోని పురుగులు, కలుపు నివారణ సాధ్యమవుతుందని, ఇది తదుపరి పంటకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. రైతులు రసాయనిక ఎరువులు వాడటం తగ్గించి, పర్యావరణ హితమైన ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

## అందుబాటులో మేలైన వరి వంగడాలు..

సాగుకు అనువైన వరి విత్తన రకాల గురించి వివరిస్తూ సన్న వడ్ల రకాల్లో కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి 5204 మరియు దొడ్డు రకాల్లో ఏంటియు 1010, కేఎన్ఎం 118 వంగడాలు అధిక దిగుబడిని ఇస్తాయని రైతులకు తెలియజేశారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) శ్రీలత, సిద్దు, జ్ఞానేశ్వర్, సంపూర్ణలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సిర్పూర్ టి, మే 4, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం రోజున రైతు వారోత్సవ కార్యక్రమాలు వ్యవసాయ అధికార గిరీశంమండల కేంద్రంలోనిరైతు వేదికలోనిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ అధిక ప్రయోజనాలు కూరగాయల సాగు లాభదాయకమైన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వడ్డేటి నాగమణి వివిధ గ్రామపంచాయతీ సర్పంచులు ఫెర్టిలైజర్ డీలర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్, మే 04, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్కపల్లి, కమ్మర్గాం రైతు వేదికల్లో సోమవారం మండల వ్యవసాయ రామకృష్ణ, సర్పంచుల ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ వేసవి దుక్కులు, మట్టి నమూనా సేకరణ, పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, పార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయ యంత్రీకరణ, మెరుగైన విత్తనాల వినియోగం, ఎరువుల సరైన వినియోగంపై రైతులకు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాంచంధర్, సులోచన వ్యవసాయ విస్తరణ అధికారి వంశీకృష్ణ, డీలర్స్, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

**భైంసా, మే 04, ప్రభాతవార్త:**

వ్యవసాయంలో ఆధునిక మెలకువలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి సూచించారు. సోమవారం దేగాం గ్రామంలోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సిరం సుష్మారెడ్డి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

**నేరడిగొండ, మే 04, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4 నుంచి 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలని సూచించారు. ముఖ్యంగా సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని ఏఈవో సౌజన్య, ఎంఏవో కృష్ణవేణి కోరారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి గిరీశం



వారోత్సవాలలో పాల్గొన్న రైతులు


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి

## నర్సాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నర్సాపూర్ (జి), మే 04, ప్రభాతవార్త**

నర్సాపూర్ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీకాంత్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అజీమ్, ఏపీఎం గంగామణి, దత్తురాం, విజయ్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**సారంగాపూర్, మే 04, ప్రభాతవార్త:**

మండలంలోని అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి ధాన్యంలో తేమ శాతం, తూర్పార పట్టడం వంటి అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రం వద్ద కల్పిస్తున్న సౌకర్యాల గురించి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కొనుగోళ్ల పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్డీఓ రత్నకళ్యాణి, సర్పంచ్ చిన్నయ్య, తహసీల్దార్ విజయ్ కాంత్ రావు, ఎంపీడీఓ లక్ష్మికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించిన ఎంపీడీవో

**సారంగాపూర్, మే 04, ప్రభాతవార్త**

మండలంలోని గోపాల్ పేట్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో లక్ష్మీకాంత్ హాజరై లబ్ధిదారులతో కలిసి పూజలు నిర్వహించి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటిని పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందించారు. అనంతరం ఎంపీడీవో ధని, సోనాపూర్ తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గంగారెడ్డి, బడి భీమన్న, రాందాస్, నాయకుడు బోండ్ల రమేష్, హౌసింగ్ ఏఈ నాగార్జున, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## మే 6న మెగా జాబ్ మేళా: కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్, మే 04, (ప్రభాతవార్త):



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మే 6వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఆదిలాబాద్‌లోని కె.ఆర్.కె. కాలనీ, మైనారిటీ గురుకుల ప్రాంగణంలో ఈ మేళా జరగనుంది. ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, రిటైల్ సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు ఈ మేళాలో అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10వ తరగతి నుంచి పీజీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి గల వారు బయోడేటా, విద్యార్హత పత్రాలు, గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు ముందుగా అధికారిక వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9346655441 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపరచాలి: సయ్యద్ హైదర్

భైంసా, మే 04, (ప్రభాతవార్త):

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిటీ స్కాన్ యంత్రం నెలల తరబడి మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని, దీంతో పేద రోగులు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఉదయం 11:30 గంటలకే ఓపీ గదులు ఖాళీ అవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుండి రోగులను ప్రైవేట్‌కు రిఫర్ చేసే పద్ధతులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిటీ స్కాన్ యంత్రాన్ని బాగు చేయాలని, విధులకు గైర్హాజరయ్యే వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: గ్రామ పంచాయతీ తీర్మానం

భైంసా, మే 04, (ప్రభాతవార్త):

యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భైంసా మండలంలోని దేగాం గ్రామస్తులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో చాలామంది యువకులు చెడు అలవాట్లకు బానిసై తప్పుదోవ పడుతున్న విషయాన్ని గమనించి, వారిని క్రమశిక్షణలో ఉంచేందుకు పలు నిబంధనలు విధించారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వారికి దుకాణాల్లో సిగరెట్లు, పొగాకు, గుట్కాలు వంటి మత్తు పదార్థాలు విక్రయించవద్దని దుకాణదారులకు సూచించారు. అలాగే మైనర్లకు మద్యం అమ్మడం పూర్తిగా నిషేధించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు 18 ఏళ్లు నిండకముందే బైక్‌లు, ఇతర వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అంశాలపై చర్చించేందుకు మంగళవారం ఉదయం 7:30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి గ్రామ యువకులు, పెద్దలు తరలిరావాలని గ్రామస్తులు కోరారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

ఆసిఫాబాద్ టౌన్, మే 4, (ప్రభాతవార్త)

మండలం లోని రహపల్లి గ్రామ పంచాయితీ సమీపంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సోమవారం ఆ గ్రామ సర్పంచ్ సుంకరి మంగ వార్డ్ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నీకల్ అసిస్టెంట్ లతో కలిసి ఉపాధి హామీ పనిచేస్తున్న ప్రదేశాలకు వెళ్ళి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లవారు జామునే ప్రజలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారని, గత వారం రోజులనుండి ఎండ తీవ్రత పెరగడంతో కూలీలకు ఇబ్బంది కలుగకుండా మజ్జికను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు జరిగే చోట చలువ పందిరి,మంచి నీరు,మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ అధికారులకు సూచించారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 04, (ప్రభాతవార్త



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం గంగారం గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి రాజ్ కుమార్ గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినియోగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన బల్మూరి పద్మ తనకు చెన్నూరు మున్సిపాలిటీలోని గ్రేస్ కాలనీలో ఇల్లు ఉందని, ఈ ఇంటిని ఇతరుల పేరిట నమోదు చేసి ఆక్రమానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్ కు చెందిన అంజయ్య తన కుమారుడికి పుట్టుకతో మూగ, చెవుడు ఉన్నాయని, యుడిఐడి కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మిఖ్యుమ్ తమ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని తెలుపుతూ సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన గడి కొప్పుల పద్మ తనకు గ్రామ శివారులో గల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.. చెన్నూరు పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన అఫ్రోజ్ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు బెల్లంపల్లి డివిజన్ పరిధిలో బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి ఆధారం కల్పిస్తాం

- రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి మంత్రి భరోసా
- మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో అద్దె గదులు ఏర్పాటు చేస్తామని హామీ

చెన్నూరు, మే 4, (ప్రభాతవార్త

చెన్నూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ జంక్షన్ నుండి రావి చెట్టు వరకు రోడ్ విస్తరణలో దుకాణ సముదాయాలను కోల్పోయిన వారికి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గదులు నిర్మించి అద్దెకు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా చెన్నూరు పట్టణంలో రోడ్డు వెడల్పు విస్తరణ పనులు జరుగుతున్న విషయం విదితమే. దీనిని దృష్టిలో పెట్టుకున్న మంత్రి వివేక్ వెంకట స్వామి బాధితులకు అన్యాయం జరగకుండా వారికి మరోచోట ఉపాధి కల్పించేందుకు ఈ మేరకు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.




## రైతు వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు

లక్షెట్టిపేట, మే 04, (ప్రభాతవార్త

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక (99 రోజుల) కార్యక్రమంలో భాగంగా ఈనెల 4వ తారీఖు నుంచి 9 వ తారీకు వరకు రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం రోజు లక్షెట్టిపేట రైతు వేదికలో రైతులకు భూసార పరీక్ష యొక్క ప్రాముఖ్యత, నానో యూరియా వినియోగం, రైతులు వేయవలసిన వరి విత్తన రకాలు, ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం మండలంలోని దౌడపల్లి, సూరారం, వెంకట్రావుపేట, జెండా వెంకటాపూర్ రైతు వేదికలలో కూడా నిర్వహించడం జరిగింది. లక్షెట్టిపేట రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, ఏఎంసీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, హెచ్ఈఓ, ఇఫ్కో కంపెనీ యొక్క ప్రతినిధి, ఏఈఓ, రైతులు పాల్గొనడం జరిగింది.

# విద్యుత్ భద్రత వినియోగదారుల చేతుల్లోనే..

ఆసిఫాబాద్ టౌన్, మే 4, (ప్రభాతవార్త :



గృహ వినియోగదారులు ముఖ్యంగా రైతులు తమ దైనందిన జీవితంలో విద్యుత్ పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే సోమవారం స్పష్టం చేశారు. జీరో ప్రమాదాలే లక్ష్యంగా పెట్టుకుని మే 1 నుండి 7 వరకు సర్కిల్ వ్యాప్తంగా విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అధికారులు, సిబ్బంది వాల్ పోస్టర్స్, కర పత్రాలు పంపిణీ చేస్తూ గ్రామాలు, కాలనీలు, వ్యవసాయ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు .విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వినియోగదారుడు తప్పక భద్రత నియమాలను వివరించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, సపోర్టు వైర్లు, స్విచ్ బోర్డులు, పరికరాలను తాకరాదని, తెగిపోయిన, వేలాడుతున్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లో తాకవద్దని, ఇంటి ముందు ఉన్న రేకులు, మెటల్ షీట్లు, గేట్లు మొదలైన వాటికి విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉన్నందున వైర్లు వాటిని తాకకుండా జాగ్రత్త వహించాలన్నారు. వ్యవసాయ మోటార్లు, ఫుట్ వాల్వులు, పైపులు తడిగా ఉన్నప్పుడు తాకరాదని, ఎర్తింగ్ లేని మోటార్లు, జి.ఐ పైపులు, ఫుట్ వాల్వులు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ భద్రతా సూచనలు పాటించాలని విద్యుత్ అధికారుల సేవలు పొందాలని కోరారు. ఎటువంటి విద్యుత్ సమస్యల కైనా 1912 టోల్ ఫ్రీ నంబర్ లో సంప్రదించాలని చెప్పారు.